తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# సూళ్లూరుపేటలో గంజాయి విక్రేతల అరెస్ట్

## - మూడున్నర లక్షల విలువైన 20 కేజీల గంజాయి స్వాధీనం



సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త : పట్టణంలో గంజాయిని అక్రమంగా తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి శుక్రవారం అరెస్టు చేశారు. నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒరిస్సా నుంచి గంజాయి తీసుకొచ్చి సత్యవేడు మండలం రామచంద్రాపురానికి చెందిన కొండా మునిశేఖర్, సూళ్లూరుపేట మండలం ఆబాకకు చెందిన ఎలింబేటి సునీల్, సూళ్లూరు ప్రాంతానికి చెందిన పాలా వినయ్, తడ మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన మద్దూరు రాజేష్, సత్యవేడు మండలం అయ్యప్పపాలేనికి చెందిన చోడవరం జ్యోతీష్‌కుమార్‌లు ఒక ముఠాగా ఏర్పడి ఈ గంజాయి రాకెట్‌ను నడిపేవారన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో స్థానిక సిఐ ఎం.మురళీకృష్ణ, ఎస్‌ఐలు బ్రహ్మనాయుడు, కొండప్పనాయుడులు వీరి విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని నిఘా పెట్టి గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని మన్నారుపోలూరు సమీపంలోని భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పట్టుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీని విలువ 3 లక్షల 50 వేల రూపాయలు ఉంటుందని, వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ చెంచుబాబు వివరించారు. వీరిని కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. అలాగే గంజాయి విక్రేతలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెంచుబాబు వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించి గంజాయి విషయంలో పోలీసులకు సహకరించి, దీన్ని అరికట్టేందుకు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు.

# సింగిల్ విండోలకు రూ.76.51 లక్షలు డివిడెంట్

**- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి అన్ని రకాల రుణాలు మంజూరు- డిసిసిబి మహాజన సభలో ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి**



డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మహాజనసభ

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లాభాల బాటలో పయనిస్తుండటంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని 75 సింగిల్‌విండోలకు 76.51 లక్షల రూపాయల డివిడెంట్లు మంజూరు చేసినట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ జరిగింది. ఈ సమావేశంలో డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసిసిబి బ్యాంకు 5.10 కోట్ల రూపాయల లాభాలు ఆర్జించడం జరిగిందని, బ్యాంకు నికర, నిరర్థక ఆస్తులు 1.92 శాతం వున్నాయని, అలాగే బ్యాంకులో 998.84 కోట్ల రూపాయల డిపాజిట్లు వున్నాయని, అలాగే బ్యాంకు రైతులు, ఇతరులకు 2,436.50 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పటిష్టంగా వుండాలంటే క్షేత్ర స్థాయిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బలోపేతం కావడానికి అన్ని రకాల రుణాలు మంజూరు చేస్తామని ఛైర్మన్ వెల్లడించారు. ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అవసరమైన రైతులకు విస్తృతంగా రుణాలు మంజూరు చేసి సహకార సంఘంను పరిపుష్టి చేసి బ్యాంకును మరింత బలోపేతం చేయాలని ఛైర్మన్ కోరారు. అలాగే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఇన్‌బ్యాలెన్స్‌ను తగ్గించడానికి పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేస్తామన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో హెచ్‌ఆర్ పాలసీని అమలు పరుస్తూ వున్న ఖాళీలను భర్తీ చేయడానికి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాలని మహాజన సభ తీర్మానించింది. అలాగే మార్చి 2025 సంవత్సరాంతపు బ్యాంకు యొక్క 107వ వార్షిక పరిపాలన నివేదికను సమావేశం పరిశీలించి ఆమోదించింది. అలాగే 2024-25 సంవత్సరపు బ్యాంకు ఆడిట్ సర్టిఫికేట్‌ను సమావేశం ఆమోదించింది. జిల్లా సహకార అధికారి లక్ష్మీ, డివిజనల్ కో-అపరేటివ్ ఆఫీసర్ వనజ, డిసిసిబి బ్యాంకు సిఇఓ శంకర్‌బాబు, బ్యాంకు అఫిషియల్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ సమస్యలు పరిష్కారానికి ద్విచక్ర వాహనాలు : జిల్లా ఎస్పీ



పోలీసు పరేడ్ గ్రౌండ్ నూతన ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక పూజలు

తిరుపతి కార్పొరేషన్, జూన్ 27 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర వ్యాప్తంగా ట్రాఫిక్ వాహనాలను డిజిపి హరీష్ కుమార్ గుప్తా తిరుపతి జిల్లాకు నూతనంగా 27 ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలను అందించారని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు అన్నారు. పోలీసు పరేడ్ గ్రౌండ్ నూతన ట్రాఫిక్ ద్విచక్ర వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ట్రాఫిక్ వాహనాలకు జుండా ఊపి ఎస్పీ ప్రారంభించారు. జిల్లాలో వివిధ సబ్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్‌లకు అందచేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మీడియాతో మాట్లాడుతూ ట్రాఫిక్ ఎన్ ఫోర్స్ మెంట్ కోసం నూతన టెక్నాలజీతో వాహనాలు రావడం మాకు సంతోషంగా ఉందన్నారు. ట్రాఫిక్ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవ చేసేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు వేగంగా ఘటన స్థలానికి చేరుకునేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 2020 సంవత్సరంలో 15 వాహనాలు ట్రాఫిక్‌కు కేటాయించారన్నారు. ఇప్పుడు 2025 సంవత్సరంలో తిరుపతి జిల్లాకు 27 వాహనాల కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తిరుపతి ట్రాఫిక్ సబ్ డివిజన్‌కు : 6, వాహనాలు, తిరుమల ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు 4 వాహనాలు, తిరుపతి టౌన్ సబ్ డివిజన్ 3 వాహనాలు, శ్రీకాళహస్తి సబ్ డివిజన్‌కు 2వాహనాలు,పుత్తూరు సబ్ డివిజన్‌కు 2 వాహనాలు, రేణుగుంట సబ్ డివిజన్ ఎయిర్ పోర్ట్ 2 వాహనాలు, నాయుడు పేట సబ్ డివిజన్: 4 వాహనాలు, గూడూరు సబ్ డివిజన్ 2 వాహనాలు, ఎమ్‌టీ హెడ్ క్వార్టర్స్ 2 వాహనాలు అందజేసామని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ, డిజిపికి 27 ద్విచక్రవాహనాలను తిరుపతికి కేటాయించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రావిమనోహరచారి, నాగభూషణం రావు క్రైమ్స్, చంద్రశేఖర్ ఆర్మడ్ రిజర్వు, డిఎస్పీలు శ్యాంసుందర్, భక్తవత్సలం, రామకృష్ణ చారి,ట్రాఫిక్ సిఐలు ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, రాజశేఖర్ రెడ్డి, రమణ రెడ్డి, రమణ శ్రీ హరికృష్ణ, ట్రాఫిక్ సిబ్బంది ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా సాధికారితే... ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యం

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



తిరుపతి విద్య, జూన్ 27 ప్రభాతవార్త : మహిళలు సాంకేతికతను అంది పుచ్చుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. మహిళా సాధికారిత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.శుక్రవారం సిఎల్ టి సెంటర్ లో మెప్మా ఆర్పీలకు ట్యాబ్ లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు.169 ఆర్పీలకు గాను 153 మందికి ట్యాబ్ లు ఆయన అందచేశారు.ట్యాబ్‌లో 60 యాప్ లు ఉన్నాయని,అన్నీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు,సర్వేలకు సంబంధించినవని ఆయన చెప్పారు.ఇకపై ప్రభుత్వ సేవలన్నీ వాట్స్ ప్ ద్వారానే అందించాలని సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లు నిర్ణయించారని ఆయన తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలను పారదర్శకంగా చేరవేయాలని ఆయన కోరారు.సాంకేతికంగా వస్తున్న మార్పులను మహిళలను త్వరగా నేర్చుకుని పురుషలతో పోటీ పడాలని ఆయన సూచించారు.కాగా 130 మంది డిజీ లక్ష్మీలకు బయోమెట్రిక్ డివైజ్ లను ఆయన అందించారు.స్వయం ఉపాధి,వ్యాపార రంగాల్లో మహిళలు రాణించేందుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుందని వాటిని మహిళలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిఎంఎం లు కృష్ణవేణి,సోమశేఖర్, సిఓలు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీవారి బ్రహ్మోత్సవాలకు..**

**-అత్యాధునిక సదుపాయాలతో నిర్మితమవుతున్న భవనం !**

# యాత్రికుల వసతి సముదాయం-5 రెడీ!



**ప్రభాతవార్త ప్రతినిధి-తిరుమల:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకూ రెట్టింప వుతున్న సమయంలో వసతి సదుపాయం కల్పించే విషయంలో కూడా టిటిడిఅధికారులు అన్ని చర్యలు తీసుకునే దిశగా కదులుతున్నారు. రోజుకు సరాసరి 90వేల మంది వరకు భక్తులు కొండపైకి వస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తిరుమలలో 7వేలపైచిలుకు గదులు 50వేలమంది భక్తులకు మాత్రమే వసతి కల్పించే వీలుంది. ఇంకా అదనంగా మరో 15వేలమంది వరకు యాత్రికులకు వసతి కోసం యాత్రికుల వసతి సముదాయాలు(పిఎసి) 1,2,3 అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికీ కొండపై లక్షమందికిపైగా భక్తులు 1.30లక్షలమంది వరకు చేరితే గదులు దొరకని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భక్తులు చెట్లక్రింద, పార్కుల్లో ,ఫుట్‌పాత్‌లపై సేదదీరుతుంటారు. దీన్ని అధిగమించే ఉద్దేశ్యంతో మూడేళ్ళక్రిందట అప్పటి టిటిడి పాలకమండలి 2022లో ("వార్త"కథనం ఆధారంగా) తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం -5 నిర్మాణం అవసరాన్ని గుర్తించింది. మరింత సులభంగా వసతి కల్పించేందుకు అవసరమైన యాత్రికుల వసతి సముదాయం (పిఏసి-5)ను నిర్మించేం దుకు అప్పటి పాలకమండలి ఆమోదించింది.ఈ నాలుగంతస్థులతో కూడిన భవనాన్ని నిర్మించేందుకు 98కోట్ల రూపాయలతో రివైజ్ట్ టెండర్‌లను కూడా ఆమోదించారు. పూర్తి పార్కింగ్ సదుపాయం, విశాలమైన హాళ్ళు, లాకర్లు, డార్మిటరీలతో ఈ నూతన పిఏసిని కూడా బాలాజీ ఆర్టీసి బస్టాండుకు సమీపంలో పిఏసి 1,2,3కి కూతవేటు దూరంలోనే నిర్మాణం కోసం స్థలం ఎంపికచేశారు. 2023లో ఈ భవనం నిర్మాణానికి భూమిపూజ జరిగింది. అప్పటినుండి ఈ పిఏసి 5 నిర్మాణం సాగుతూనే ఉంది. గత ఏడాది జూన్‌లో నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడం, ఆ తరువాత వరుసగా టిటిడిలో ఈఓ,అదనపుఈఓలు నూతనంగా బాధ్యతలు చేపట్టడం జరిగింది. అయినా పిఏసి 5 నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. భక్తులరద్దీ పెరుగుతుండటంతో యాత్రికుల వసతి సముదాయం 5ను త్వరగా నిర్మాణం పనులు పూర్తిచేయాలని తరచూ అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షణ చేశారు. గత ఏడాది అక్టోబర్ బ్రహ్మోత్సవాలనాటికి ఈ పనులు పూర్తికావలసి ఉన్నా కొన్ని సాంకేతిక కారణాలు, భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో పనులు సాగుతూనే ఉన్నాయి. గత ఏడాది నవంబర్ నుండి ఈ నూతన వసతి సముదాయం పూర్తిచేసేలా అదనపు ఈఓ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఎప్పటికప్పుడు ఇంజనీరింగ్ అధికారులతో కలసి తనిఖీ చేయడం, పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించడం జరిగింది. ఉన్న మూడు పిఏసిల్లో 15వేలమంది వరకు యాత్రికులకు డార్మిటరీ వసతి, లాకర్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు పిఏసి 5 భవనం అందుబాటులోకి వస్తే అదనంగా మరో ఐదారువేలమంది వరకు భక్తులకు వసతి సమకూరుతుంది. డార్మిటరీలు, లాకర్లు, అన్నప్రసాదం డైనింగ్ హాళ్ళు, టాయిలెట్లు, డిస్పెన్సరీ, పెద్దకల్యాణకట్ట,వేడినీళ్ళ సౌకర్యం కూడా కల్పిస్తున్నారు. ఈ భవనం లోపల ప్లాస్టరింగ్ పనులు,వెలుపల రంగులు వేయడం, ఫ్లోరింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి.

# సింగపూర్ సంస్థతో కుప్పం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త : కుప్పం ప్రాంత అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు అమరావతి నగరంకు ప్లాన్ రూపొందిస్తున్న సింగపూర్ సంస్థచే మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేయిస్తున్నారని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాంతో కలసి మాట్లాడారు. కుప ్పంలో త్వరలోనే సిఎం చంద్రబాబు నాయుడు టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభిస్తారన్నారు. ఈసెంటర్ కుప్పం ఏరియా ఆస్పత్రితో పాటు అన్ని పిహెచ్‌సిలతో అనుసంధానం చేయబడు తుందని ప్రజల ఆరోగ్య రికార్డులు డిజిటల్ చేయడం జరుగుతుందన్నారు. 1995లో సిఎం చంద్రబాబునాయుడు టెక్నాలజీని ఉమ్మడి రాష్ట్రంలో అందుబాటులో తెచ్చారన్నారు. ఉమ్మడి రా ష్ట్రంలో నాడు ఏర్పాటైన ఇంజనీరింగ్ కాలేజ్‌లతో ఎంతోమంది యువత నేడు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిల్లో ఉన్నారన్నారు. కుప్పంలో సైతం ద్రవిడ వర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజ్ ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కుప్పంలో జరిగే చిన్న చిన్న సంఘటనలను కూడా వైఎస్ జగన్‌కు చెందిన మీడియా సంస్థలు భూతద్దంలో పెట్టి చూపుతూ ప్రజల్లో తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం తగదన్నారు. వైకాపా పాలనలో ఏం జరిగిందో తమ ప్రభుత్వ పాలనలో ఏం జరుగుతోందో ప్రజలకు తెలుసన్నారు. సమావేశంలో మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, నేతలు జెఎంసి మురళి, రమేష్, గోపాల్ పాల్గొన్నారు.

# నాలుగు పసుపు దారాలు రూ.500లా?

## -ఎన్ని సంస్కరణలు ప్రవేశ పెట్టిన మారని తీరు




తేరువీధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హోం గార్డులు

శ్రీకాళహస్తి,జూన్ 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులు నిలువు దోపిడికి గురికాకుండా ఆలయంలో ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెడుతున్నారు. దళారులను కట్టడి చేయటానికి కఠినంగా వ్యవహరిస్తున్నారు. అయితే ఆలయానికి వచ్చే భక్తులు ఆలయంలో అడుగుపెట్టక ముందే వ్యాపారులు నిలువు దోపిడి చేస్తున్నారు.శుక్రవారం బయటి నుంచి వచ్చిన ఓ భక్తుని తేరువీధిలోని వ్యాపారులు నాలుగు పసుపు తాళ్ళు చేతిలో పెట్టి రూ.500లు వసూలు చేసుకున్న సంఘటన హోంగార్డుల దృష్టికి వచ్చింది. వారు నిత్యం ఆలయ పరిసరాల్లో గస్తి తిరుగుతున్నారు.శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి భావంతో వస్తున్న భక్తులు దోపిడికి గురౌతున్నారు. బస్సు దిగినప్పటి నుంచి పాదరక్షలు ఉచితంగా భద్రపరుస్తామని కొందరు పూజలకు సామగ్రి కొనుగోలు చేసుకోమని మరొకరు మభ్యపెడు తున్నారు. వారి చేతికి సంచి ఇచ్చి కాసులు వసూలు చేసుకుంటున్నారు.ఈ సమస్య పలుమార్లు ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి దృష్టికి వచ్చింది. దాంతో ఆయన ఆలయంలో విధులు నిర్వహించే హోంగార్డులకు కట్టడి చేయటానికి బాధ్యతలు అప్పగించారు.వారు ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి ఓ పది మంది పెట్రోలింగ్ వాహనంతో పాటు నడచి వెళుతున్నారు. ప్రతి అంగడి వద్ద పరిశీలన జరుపుతున్నారు. ముఖ్యంగా తేరువీధి, సన్నిధి వీధి,దిగువ సన్నిధివీధి,బిక్షాల గాలిగోపురం వద్ద నిత్యం పరిశీలించుకుంటున్నారు. భక్తల భద్రతకు సంబంధించి ఆలయాధికారి బాపిరెడ్డి సకల చర్యలు తీసుకుంటున్నారు.కానీ ఆచరణలో కొన్ని ఇబ్బందులు ఎదురౌతున్నాయి. ఈ నేపథ్యంలో వారంలో శుక్ర,శని,ఆది,సోమ వారాల్లో కట్టుదిట్టంగా గస్తీ తిరుగుటకు సూచించారు.ఈ నేపథ్యంలో ప్రతి రోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం పెట్రోలింగ్ జరుగుతున్న సమయంలో రథం వద్ద ఓ భక్తుని వ్యాపారులు మభ్యపెట్టి నాలుగు పసుపు దారాలు చేతిలో పెట్టి రూ.500లు వసూలు చేసుకున్నట్లు భక్తులు ఫిర్యాదు చేసారు. ఈ పెట్రోలింగ్‌లో ఆర్ శ్రీనివాసులునాయుడు, తేజ,రెడ్డెప్ప, సురేష్, చెంచయ్య, నరేష్, నాదముని తదితరులు పాల్గొన్నారు.

**యాగశాల ఏర్పాటు... ధ్వజా రోహణం**

# వైభవంగా ధర్మరాజుల తిరునాళ్లు ప్రారంభం

శ్రీకాళహస్తి,జూన్ 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ధర్మరాజుల తిరునాళ్ళు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాల్లో తెలుగుదుశం నాయకులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఆలయ ఆవరణలో శాస్త్రోక్తంగా హోమాలు ఏర్పాటు చేసారు. కలశ స్థాపనను ఆలయ అర్చకులు డాక్టర్ స్వామీనాధన్ గురుకుల్ సారధ్యంలో నిర్వహించారు. ఉదయం ఉత్సవ మూర్తులను గ్రామోత్సవం జరిపి ఆలయం వద్దకు చేర్చారు. అక్కడ మూల విరాట్టులకు పూజలు జరిపారు. అక్కడ నుంచి మేళ తాళాలు, మంగళవాయిద్యాలు పంబజోళ్ళ మోతతో దద్దరిల్లింది. యాగశాలకు ఉత్సవమూర్తుల నుంచి దీపంను తీసుకొని వచ్చి హోమం వెలిగించారు.ఇక్కడ శాస్త్రోక్తంగా పూజలు జరిపారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

**శాస్త్రోక్తంగా ధ్వజారోహణం:** ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేసారు. విద్యుత్ దీపాలతో జిగేలు మనిపించారు.ఆలయ ఆవరణంతా భక్తి భావం ఉట్టి పడేటట్లు తీర్చి దిద్దారు. మూడు రోజుల పాటు ఇఓ బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి వారి సిబ్బంది ఇక్కడ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పాండవ జననం,కౌరవ జననం కథతో అంకురార్పణ ధ్వజారోహణం నిర్వహించారు.12రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రతి రోజూ ఉదయం సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించబడుతుందని ఇఓ వివరించారు. ధ్వజారోహణం తరువాత పట్టణంలో గ్రామోత్సవం నిర్వహించారు.ధ్వజారోహణ కార్యక్రమాల్లో ఇఓ బాపిరెడ్డి డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాధన్‌గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, శానిటరీ ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, తెలుగుదేశం నాయకులు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, మిన్నల్ రవి, ఆర్ముగం గోపి, కాసరం రమేష్,అమర్‌నాథ్, సుబ్బయ్య, మునిరాజ్ యాదవ్, బాలాజి రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# జూలై 2న సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన



కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూలై 2వతేది కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆరోజు శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ఇంటింటికీ తెదేపా కార్యక్రమంను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తారు. సిఎం చంద్రబాబునాయుడు ఈ సందర్భంగా కుటుంబ సాధికార సభ్యులుగా తన పరిధిలో వచ్చే అరవై కుటుంబాల ప్రజలతో వారి ఇళ్లకు వెళ్లి మాట్లాడతారు. ప్రభుత్వం తరపున అందుతున్న పథకాలు, వారికి కలిగిన లబ్ధి గురించి అడిగి తెలుసుకుంటారు. అనంతరం తులసి నాయనపల్లి వద్ద బహిరంగ సభలో సిఎం ప్రసంగిస్తారని సమాచారం. కాగా సిఎం పర్యటన పూర్తి వివరాలు అధికారికంగా తెలియాల్సి ఉంది.

## జిల్లా కలెక్టర్‌చే సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



శాంతిపురం, జూన్ 27 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు జూలై 2న శాంతిపురం మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, కడ పి.డి. వికాస్ మర్మత్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఏర్పాట్లు పరిశీలించారు. మండలంలోని తిమ్మరాజుపల్లి గ్రామంలో సిఎం పర్యటన ఉండడంతో గ్రామంలో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లు పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. అలాగే తులసినాయనపల్లి వద్ద సిఎం బహిరంగసభకు స్థల ం, హెలిప్యాడ్‌కు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నేతలు విశ్వనాథ నాయుడు, ఉదయ్, జనార్ధనరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ బస్సులు మరిన్ని వస్తున్నాయి

**తిరుపతి జిల్లా నూతన డిపిటిఓ జగదీశ్**

తిరుపతి(రవాణ),జూన్ 27ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో ప్రయాణీకులకు సౌకర్య వంతంగా బస్సు సర్వీసులు నడుపుతామని, తిరుమలకొండకు భక్తులకు అసౌకర్యం లేకుండా బస్సుసర్వీసులు సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చేలా చూస్తామని తిరుపతి జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.జగదీశ్ తెలిపారు. తిరుపతి ప్రజారవాణా అధికారిగా శుక్రవారం ఉదయం ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా తిరుపతి జిల్లాలో ముఖ్యంగా తిరుమల, తిరుచా నూరు, అప్పలాయగుంట, శ్రీనివాస మంగాపురం, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలకు ఆర్టీసి బస్సులు ప్రయాణీకులకు మరింతగా అందుబాటులో ఉండేలా చూస్తామ న్నారు. ఇప్పటికే కాణిపాకంకు నడుస్తున్న బస్సు సర్వీసులను, ప్రయాణీకుల రద్దీకి తగ్గట్లు అదనపు బస్సులను నడుపుతామన్నారు. చిత్తూరుజిల్లా డిపిటిఓగా ఉన్న జగదీశ్ తిరుపతి జిల్లాకు రావడంతో కొంత అవగాహన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఆయనను డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పి.విశ్వనాథ్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ అధికారి టి.బాలాజీ, తిరుపతి, అలిపిరి, మంగళం, తిరుమల డిపో మేనేజర్లు, జిల్లా కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు.

## ఏపీ ఎంసెట్,లా సెట్ లలో విద్యార్థినిల ప్రతిభ

తిరుపతి విద్య, జూన్ 27 ప్రభాతవార్త: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినిలు ఇటీవల జరిగిన ఏపీ ఎంసెట్,లా సెట్ లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను టిటిడి డీఈవో వెంకట సునీల్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ సిలబస్ తో పాటు ప్రతివారం ఎంట్రన్స్ పరీక్షలకు సంబంధించి టెస్ట్ లు నిర్వహించి ఎప్పటికప్పుడు వారికి తగిన తర్ఫీదు ఇవ్వడం జరిగిందని పత్రికా ముఖంగా తెలియజేశారు. ఎంసెట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు.పి వంశిక,పీ రేవతి,ఎం శ్రీలక్ష్మి,కే సాహితీ చందన,పి లక్ష్మి, పి.శిరీష,టి.రోషిని,వి విష్ణు ప్రియ,సి హేమ,ఎం గంగోత్రి,బి లావణ్య,టి సాయి కీర్తన,లా సెట్‌లో ఎం మహాలక్ష్మి,ఏ ప్రవల్లిక,ఎం మహాలక్ష్మి కర్నూల్ సిల్వర్ సెట్ లో కూడా 3వ ర్యాంక్ లు సాధించారని తెలిపారు.

## ప్రారంభమైన వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్



**చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:** ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ శుక్రవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ప్రశాంతంగా ప్రారంభమైంది. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్‌ను చిత్తూరు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ నరసింహప్రసాద్ వార్డు, గ్రామ సచివాలయ శాఖ బదిలీలపై జారీ చేసిన ఉత్తర్వులు, బదిలీల మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలోని చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లి, పుంగనూరు, పలమనేరు, కుప్పం, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్ళు పూర్తి చేసుకుని బదిలీల కోసం అప్షన్ నమోదు చేసిన వార్డు కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియకు వార్డు అడ్మిన్ కార్యదర్శులు 153 మంది, వార్డు అమినిటీ కార్యదర్శులు 173 మంది, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు 143 మంది హాజరయ్యారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమానికి తిరుపతి మున్సిపల్ అడిషనల్ కమీషనర్ చరణ్‌తేజరెడ్డి, చిత్తూరు అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్, ఇతర పురసంఘాల కమీషనర్లు, అధికారులు హాజరయ్యారు.

## మొరసనపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమం

శాంతిపురం, జూన్ 27 ప్రభాతవార్త :



మండలంలోని మొరసనపల్లి పంచాయతీలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుమార్, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, రమేష్, చంద్ర, గోపాల్, కడ సభ్యురాలు సుగుణమ్మ పాల్గొన్నారు.

## పంటలపై కొనసాగుతున్న ఒంటరి ఏనుగు దాడులు

**రామకుప్పం, జూన్ 27 ప్రభాతవార్త :** మండలంలోని ననియాల అటవీ ప్రాంతం సరిహద్దుల్లో ఒంటరి ఏనుగు పంట పొలాలను నాశనం చేస్తోంది. గురువారం రాత్రి నారాయణప్ప, శంకరప్ప, నాగరాజు అనే రైతులకు చెందిన మామిడి, టెంకాయ చెట్లు, అరటితోటలను తిన్నంత తిని ధ్వంసంచేసింది. చీకటి పడగానే ఒంటరి ఏనుగు అటవీ లోతట్టు ప్రాంతం నుంచి గ్రామాల వైపు వచ్చి పంటలపై దాడులకు దిగుతోంది. అటవీ అధికారులు, ట్రాకర్లు ఏనుగు దారి మళ్లింపుకు చర్యలు చేపడుతున్నా ఫలితం లేదు. ఏనుగుల దాడులను శాశ్వతంగా నివారించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాల్సి ఉందని రైతులు కోరుతున్నారు.

## డిసిసిబి ఛైర్మన్‌ను కలసిన దేశం నేతలు

**రామకుప్పం, జూన్ 27 ప్రభాతవార్త :**



జిల్లా సహకార బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిని శుక్రవారం చిత్తూరులో రామకుప్పం తెదేపిఅ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తమ ప్రాంత రైతులకు వ్యవసాయ, చిన్న తరహా పరిశ్రమలు, పాడి సంపద కొనుగోళ్లకు సంబంధించి రుణాలు మంజూరు చేయాలని అలాగే విజలాపురంలో డిసిసి బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా నేతలు మునస్వామి, పత్ర నారాయణ, జయశంకర్, గిరిదాసు, రామలింగారెడ్డి, వెంకటాచలం, నాగరాజు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే కుప్పం అభివృద్ధి

**రామకుప్పం, జూన్ 27 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలుగురైతు విభాగం అధ్యక్షుడు చలపతి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివంగత ఎన్టీఆర్ కలలను సాకారం చేస్తూ హంద్రీ-నీవా పనులు పూర్తి చేయిస్తున్నారన్నారు. కుప్పంలో పాడి రైతులకు గోకులం షెడ్లు, సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు, పనిముట్లు, ట్రాక్టర్లు, పంటలసాగుకు రాయితీలు, డ్రిప్ ఇరిగేషన్ అందిస్తున్నారన్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నారన్నారు. పాలారు నదిపై చెక్‌డ్యాముల మరమ్మతులకు 53కోట్లు మంజూరు చేయడంపట్లహర్షంవ్యక్తంచేశారు.నేతలు నాగభూషణం, కొల్లుపల్లి బాబు, గోపాల్ పాల్గొన్నారు.

## చెట్టును టువీలర్‌లో ఢీకొని యువకుడి మృతి

**కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త:**

కుప్పం -మల్లానూరు మార్గంలో శుక్రవారం ఓ యువకుడు టువీ లర్‌లో చెట్టును ఢీకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బంగానత్తం గ్రామంలో నివాసం ఉం టున్న మసూద్ బాషా (22)అనే యువకుడు టివి ఎస్ వాహనంలో వస్తూ ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొనడంతో అతని తలకు తీవ్రగాయాలై మృతి చెందాడన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కారు బోల్తా..నవ వదువు,వరుడికి గాయాలు..!



**గంగవరం,జూన్ 27 ,ప్రభాతవార్త :** కారు బోల్తాపడి నూతన దంపతులకు గాయాలుపాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది.గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్‌కథనం మేరకు వివరాలిలా..పాలసముద్రం మండలం బలిజకండ్రిగకు చెందిన సతీష్(40), తేజుప్రియ(30)లకు శుక్రవారం ఉదయం బలిజకండ్రిగలోని పద్మశాలి కళ్యాణ మండపం నందు వివాహం జరిగింది.ఈ నేపథ్యంలో నూతన దంపతులతో పాటు కుటుంబ సభ్యులతో కలిసి పళ్ళిపట్టు నుండి బెంగళూరుకు కారులో వస్తుండగా మండలంలోని బెంగళూరు చెన్నై జాతీయ రహదారిపై దండపల్లె క్రాస్ వద్దకు రాగానే డ్రైవర్ హరీష్(36) నిద్ర మత్తులో ఉండడంతో కారు వేగంగా వస్తూ రహదారి పక్కనే ఉన్న కాలువలోనికి బోల్తాపడింది.నూతన దంపతులతో పాటు కారులో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులు సంప్రిత్(4),పుష్పలత(32),హరీష్(36)లు స్వల్పంగా గాయపడ్డారు.ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ద్వంసమైంది.విషయం తెలుసుకున్న సిఐ ప్రసాద్ సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించి క్షతగాత్రులను పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యయత్నం..!

**గంగవరం,జూన్ 27 ,ప్రభాతవార్త :**

ఇంటర్మీడియట్ చదువుతున్న మొదటి సంవత్సరంచదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ ఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది.స్థానికుల కథనం మేరకు వివరాలిలా..మామడుగు పంచాయతీ కంచిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులాచారి కుమార్తె భవ్య(17) అనే యువతి మండలంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతుంది.కడుపునొప్పి తాళలేక శుక్రవారం రాత్రి ఇంట్లోనే పురుగులు మందు సేవించి అపస్మారక స్థితిలో పడిఉండడంతో కుటుంబ సభ్యులు వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై ఎలాంటి పోలీసు కేసు నమోదు కాలేదు.

## భోజనశాలలో పారిశుద్ధ్యం పాటించాలి : గువ్వల



**బోయకొండ(చౌడేపల్లి), జూన్ 27 ప్రభాతవార్త:** శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న అన్నదాన శిబిరంలో పారిశుధ్యాన్ని పాటించాలని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలోని అన్నదాన ప్రసాద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆలయ ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం, తేదేపా నాయకులు జన్నె సుబ్రమణ్యం నాయుడు, అర్జున్‌రాయల్, పవన్‌కుమార్, ముని, రెడ్డి, రాధా, ఆలయ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## జయ జయహే వారాహీ మతా నమోస్తుతే...!



**చౌడేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త :** మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవీదేవి ఆలయంలో వారాహీమాతాకు అషాఢ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజున శుక్రవారం మహిళా భక్తులచే నిర్వహించబడ్డ సౌందర్యలహరి పారాయణం భక్తులను అలరించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు దేవస్థానం నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థికసాయం



**చౌడేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త:** స్నేహితులంతా చేయి చేయి కలపారు. మరణించిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం చేసారు. మలేషియాలో సాఫ్ట్‌వేర్ ఉద్యో గం చేస్తున్న యువరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అక్కడున్న చౌడేపల్లికి చెందిన మా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ జగదీష్ రాయల్ స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవాలనే సంకల్పంతో ఇతర మిత్ర బృందంనుంచిరూ.3.10లక్షలనుసేకరించిమృతుడుయువరాజుతల్లిదండ్రులకు చెక్ రూపంలో అందించాడు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకొనేందుకు సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపాడు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి!



**బంగారుపాళ్యం, జూన్ 27 ప్రభాతవార్త:** చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి తంబుగానిపల్లి క్రాస్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తిశ్రీనివాసులు తెలిపారు. తంబుగానిపల్లికి చెందిన పులికంటి జయచంద్ర(22) ద్విచక్రవాహనంలో చిత్తూరుకు గురువారం సాయంత్రం వెళ్ళాడు. తిరిగి రాత్రి వేళ స్వగ్రామంకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. తమ్ముగానిపల్లి క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనంను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జయచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహంను శవపరీక్ష నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ చెప్పారు.

## కుప్పాన్ని విద్యాకేంద్రంగా మార్చుతున్న సిఎం : కంచర్ల



కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు కుప్పాన్ని విద్యా కేంద్రంగా మార్చుతున్నారని ప్రభుత్వ విప్, కడ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఒకప్పుడు కుప్పంలో పాఠశాలలు తక్కువగా ఉండేవన్నారు. సిఎం చంద్రబాబునాయుడు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి గ్రామంలో పాఠశాలలు, మండలానికి ఓ జూనియర్ కాలేజ్, ప్రైవేట్ పరంగా ఇంజనీరింగ్, మెడికల్ కాలేజ్‌లు ఏర్పాటుచేయించారన్నారు. కుప్పంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేసి విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించారన్నారు. త్వరలో డిగ్రీ కళాశాలలకు అఫిలియేషన్‌లు సైతం మంజూరు చేస్తారన్నారు. కుప్పంలో పరిశ్రమలు, ఎయిర్‌పోర్టు నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నారు.

## నాటుసారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

కుప్పం జూన్ 27 ప్రభాతవార్త



మండలంలోని మొట్లచేను వద్ద అక్రమంగా నాటుసారా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. మొట్లచేనుకు చెందిన మల్లేష్ (53) అనే వ్యక్తి పది లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డాడన్నారు. అతనికి నాటుసారా సరఫరా చేసే మారెమ్మగుడి కొటాలుకు చెందిన అయ్యప్ప (33), వెంకటేష్ (35)లపై సైతం కేసు నమోదు చేశామన్నారు. కుప్పం నియోజకవర్గంలో ఎవరైనా నాటుసారా తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారాపై ప్రజలు ఎక్సైజ్‌సిఐఫోన్ నెం 9882399789, ఎస్సై 9441949568నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రకు ప్రజలు సహకరించాలి

**కుప్పంరూరల్, జూన్ 27 ప్రభాతవార్త :**



సిఎం చంద్రబా బునాయుడు చేపట్టిన స్వచ్ఛా ంధ్ర, స్వర్ణా ంధ్ర కార్యక్ర మంకు ప్రజలు తమవంతుగా సహకరించాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం కంగుందిలో కడ అధ్వర్యంలో ప్రజలకు స్వచ్ఛకుప్పంపై అవగాహన కార్యక్రమంను గ్రీన్‌వే సంస్థ ద్వారా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో చెత్త సేకరణకు ప్లాస్టిక్ బుట్టలు పంపిణీ చేసిందని తడి,పొడి చెత్తలను ప్రజలు అందులో వేస్తే పంచాయతీ వారు చెత్తను సేకరిస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనశేఖర్, పార్టీ అధ్యక్షుడు షరీష్, మాజీ సర్పంచ్ లోకేష్, యూనిట్ ఇన్‌చార్జ్ దివాకర్, గ్రీన్‌వే సంస్థ ప్రతినిధి లావణ్య, స్థానికులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అపోలో యూనివర్శిటీలో కొత్త కంప్యూటర్ ల్యాబ్

**చిత్తూరురూరల్, జూన్ 27 ప్రభాతవార్త:**



చిత్తూరుపట్టణం, అపోలో యూనివర్శిటీలోని డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లో నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ హెచ్ వినోద్‌భట్ ప్రారంభించారు. యూనివర్శిటీలో సాంకేతిక విద్యను మరింత మెరుగుపరచడం, విద్యార్థులకు ఆధునాతన సాంకేతికతను అందించడంలో ఈ ల్యాబ్ కొత్త అధ్యయానికి నాంది పలుకుతుందని, అలాగే అత్యాధునిక కంప్యూటర్లు, హై స్పీడ్ ఇంటర్నెట్, ఇతర అవసరమైన ఉపకరణాలు విద్యార్థులు తమ ప్రాజెక్టులు, అసైన్‌మెంట్లు, పరిశోధనలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పోతురాజు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ డి జగదీశన్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ డా. భాస్కర్‌రెడ్డి, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ డా. రామయ్య, విభాగాధిపతులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, డిప్యూటీ జనరల్ మేనేజర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : మేయర్

**చిత్తూరురూరల్, జూన్ 27 ప్రభాతవార్త:**



ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మేయర్ ఎస్ అముద అధికారులకు సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయం ప్రజాదర్బార్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందించిన వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలని, ఆర్థికపరమైన పనులపై అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామరెడ్డి, చిత్తూరు రూరల్ ఎంపిడివో శ్రీనివాసులు, డిటీ ఇబ్రహీం, హౌసింగ్ ఎఈ శ్రీధర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మలేరియా నియంత్రణ అవగాహన ర్యాలీ

**తవణంపల్లె, జూన్ 27 ప్రభాతవార్త:** మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అరగొండలో మలేరియా



నివారణ మాసోత్సవాల సందర్భంగా మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో అధ్వర్యంలో పంచాయతీ వైద్యసిబ్బంది, అరగొండ బాలుర, బాలికోన్నత పాఠశాల,అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులచే భారీ ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు.అనంతరం కొత్తబస్టాండులో మానహారం నిర్వహించి దోమల నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా సబ్ యూనిట్ అధికారులు శివ సుబ్రమణ్యం, రామకృష్ణ,ఏపీహెచ్ఈఓభాను ప్రకాష్, మండల వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ, సీహెచ్ఓ జ్ఞానశేఖర్, పీహెచ్ఎన్‌జీవకళ,హెల్త్‌సూపర్‌వైజర్లురాజశేఖర్,గోపినారాయణ,ఆరోగ్యకార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, శరత్‌కుమార్, సతీష్‌కుమార్, భార్గవి, రోజా,ఎంఎల్ హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో సీసీఎల్ఏ చీఫ్ కమీషనర్

**కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త:**



రాష్ట్ర చీఫ్ కమీ షనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జయలక్ష్మి కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, ఐరాల తహశీల్దార్ లోకేశ్వరి, డీటి మహేష్‌కుమార్, ఆలయ సూపరెడెంట్ కోదండపాణి, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాభారత యజ్ఞం ప్రారంభం

**తవణంపల్లె, జూన్ 27 ప్రభాతవార్త:** మండలంలోని దిగువమాఘంలో శుక్రవారం మహాభారత యజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. ప్రతి ఏటా గ్రామంలోని బహుదానది ఒడ్డున వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో 21 రోజుల పాటు మహాభారత యజ్ఞం కార్యక్రమంను అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు ధర్మకర్త ఆర్.ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచం ద్రనాయుడుల సహకారంతో గ్రామస్థులు ఈకార్యక్రమం నిర్వహిస్తుంటారు. ఈసందర్భంగా శుక్రవారం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గరిగ ఉత్సవం, ధ్వజారోహణం కార్యక్రమంలను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈమేరకు ఈనెల 27 నుండి జూలై 21 వరకు యం.పూర్ణ భాగవతారిణీచే పగలు హరికథలు, కాణిపాకం మురుగన్ నాట్యమండలి వారిచే రాత్రి నాటక ప్రదర్శనలు వుంటాయని ఉమాపతిరెడ్డి తెలిపారు.ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## వృద్ధులు దివ్యాంగులకు రేషన్ పంపిణీ

**సదుం, జూన్ 27 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దివ్యాంగులకు వృద్ధులకు రేషన్ పంపిణీ శుక్రవారం నుంచి సదుం మండలంలో ప్రారంభించారు. చౌక దుకాణాల డీలర్లు వారి పరిధిలోని వృద్ధుల ఇళ్లకు వికలాంగులు ఇళ్లకు నేరుగా వెళ్లి వారి వద్ద నుంచి వేలిముద్రలు తీసుకొని బియ్యం, చక్కెర పంపిణీ చేశారు. తప్పిపోయిన వారికి ఈ రెండు రోజుల్లో పూర్తి చేస్తామని డీలర్లసంఘంఅధ్యక్షుడు వామచంద్రారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

## విద్యుత్ వాహనాలపై...

రెండు దశల శిక్షణా కార్యక్రమం

**తిరుపతి(రవాణ),జూన్ 27ప్రభాతవార్త :**



ఆర్టీసిలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని మరింతగా అభివృద్ధి పరచడం, నిర్వహణలో నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా ఒక సమగ్రశిక్షణా కార్యక్రమాన్ని రెండు దశాల్లో పూర్తిచేయడం జరిగిందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్)చెంగల్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. చివరిరోజు శుక్రవారం 13డిపోలకు చెందిన ప్రతి డిపోనుండి ఐదుగురు డిపోమేనేజర్, గ్యారేజ్ ఇన్‌ఛార్జి, ఇద్దరు మెకానిక్‌లు, ఒక ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.విద్యుత్ వాహనాల సేవల నాణ్యతను మెరుగుపరచడానికి శిక్షణ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డిపిటిఒ జగదీశ్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.బాలాజీ, రీజనల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహేంద్ర పాల్గొన్నారు

## పంటల బీమా పథకాలపై రైతులకు అవగాహన

**తిరుపతిరూరల్, జూన్27 ప్రభాతవార్త:**

ఖరీఫ్ సీజన్ 2025-26గాను రైతులు స్వచ్ఛందంగా నమోదు చేసుకోవచ్చునని మండల వ్యవసాధికారి ఏవి.సుబ్బారావు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు గాను రెండు పంట బీమా పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు. పిఎంఎఫ్‌బివై (ప్రధానమంత్రి పసల్ బీమా యోజన) దిగుబడి ఆధారంగా తిరుపతి జిల్లాలో ఈ పథకం క్రింద రెండు పంటలు వరి,సజ్జ పంటలకు ఖరీఫ్ కాలానికి నోటీఫై చేయబడిన ట్లు తెలిపారు. వరి పంటకు గ్రామాన్ని బీమా యూనిట్‌గా, సజ్జ పంటకు జిల్లా బీమా యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. తిరుపతి జిల్లాలో ఫ్యూచర్ జెనెరలి అనే కంపెనీ పంట భీయా అమలు చేస్తున్నట్లు తెలిపారు. వరి పంట హెక్టారుకు రూ.420 రుపాయాలు, సజ్జ పంటకు హెక్టార్‌కు రూ. 160 రుపాయాలు చెల్లించాలని తెలిపారు. వరి పంటకు ప్రిమియం చెల్లించాల్సి తేదీ 15-825 కాగా, సజ్జ పంటకు 31-7-25 నాటికి చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వేరుశనగ పంటకు హెక్టారుకు రూ.1400 రుపాయాలు, నిమ్మకు రూ.6250, చెల్లించాల్సి ఉందని, జూలై 15నాటికి ప్రిమియం చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఇతర వివరాలకు 8331057843 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## అమ్మవారికి ఆషాడమాసం పూజలు ప్రారంభం

**సదుం, జూన్ 27 ప్రభాతవార్త :**



మండల పరిధిలోని జాండ్రపేటలో ఉన్న శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నుంచి ఆషాడ మాసం పూజలు ప్రారంభించారు. ఆలయంలో ఉదయం హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కూరగాయలతో సకంబరి అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆషాడమాసంలో ప్రతిరోజు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు జక్కల రవి తెలిపారు.

## ద్రవిడ వర్సిటీకి ప్రభుత్వంచే ఇంజనీరింగ్ కాలేజ్ మంజూరు

- రెండు బ్రాంచ్‌లతో ఈ ఏడాదే తరగతులు ప్రారంభం!

**కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త :**



సిఎం చంద్రబాబునాయుడు కుప్పం ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంకు అనుబంధంగా ప్రభుత్వం ఇంజనీరింగ్ కాలేజ్‌ను మంజూరు చేసింది. 2025-26 విద్యా సంవత్సరంనుంచే వర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సుల ప్రారంభంకు ఆదేశాలు ఇచ్చింది. కొత్తగాప్రారంభమయ్యే ఇంజనీరింగ్ కాలేజ్‌లో బిటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సిఎస్ఇ), సిఎస్ఇ విత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నిం గ్ (ఎఐ, ఎంఎల్) కోర్సులు ప్రారంభించనున్నారు. ఒక్కో బ్రాంచ్‌కు 60 సీట్ల వంతున మొత్తం 120 సీట్లను వర్సిటీకి కేటాయించారు. కాగా ఇదివరకే వర్సిటీకి అనుబంధంగా డిగ్రీ కాలేజ్ కొనసాగుతుండగా ప్రభుత్వం కుప్పం ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం కొత్తగా ఇంజనీరింగ్ కాలేజ్‌ను మంజూరు చేసింది. దీంతో విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. కాగా ఏడాది కూటమి పాలనలోనే ద్రవిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులకు వేతనాల కింద సిఎం చంద్రబాబునాయుడు తొలివిడత 2.86 కోట్లు, మలివిడతలో 5.2కోట్లు మంజూరు చేయించారు. వర్సిటీకి ఇంజనీరింగ్ కాలేజ్‌ను ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎం. దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్‌లు సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## శివయ్య సేవలో తెలంగాణ ఉన్నతాధికారులు

శ్రీకాళహస్తి,జూన్ 27 ప్రభాతవార్త:



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరా యానికి శుక్రవారం తెలంగాణ రాజ్‌భవన్ కో ఆర్డినేటర్ ప్రద్యుమ్న, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సంఘం నాయకులు ఉదయ్‌కుమార్, నారాయణరావు, ఆంజనేయులు,శివశంకరులు విచ్చేసారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఒ మోహన్ సారధ్యంలో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువా వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు ఏర్పాటు చేసారు.వీరికి దర్శనం ఏర్పాట్లను శ్రీకాళహస్తి నియోజకవర్గ సిపిఐ ఇన్‌చార్జి జనమాల గురవయ్య సారధ్యంలో పర్యవేక్షించారు.వారికి సిపిఐ కి చెందిన ప్రముఖులు రోడ్ల గోపి, గుండాల బాబు, సుధీర్, ప్రసన్న కుమార్, చారుశీల, కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

## విశారద పరీక్షల్లో గిరిజన గురుకుల విద్యార్థుల హవా!

శ్రీకాళహస్తి,జూన్ 27 ప్రభాతవార్త:



ఆంధ్ర ప్రదేశ్ హిందీ ప్రచార సభ నిర్వహించిన హిందీ భాషా పరీక్షల్లో శ్రీ కాళ హ స్తి లో ని గిరిజన గురుకుల విద్యార్థులు తమ ( ప ్ తి బ . ా చాటారు.ఫిబ్రవరిలో నిర్వహించిన పోటీల ఫలితాలు వెలువడ్డాయి.ఈ పోటీ పరీక్షల్లో 73 మంది విద్యార్థులు హాజరు కాగా ప్రథమ శ్రేణిలో ప్రవేశిక, ప్రథమ,మధ్యమ, ఉత్తమ విశారద పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ప్రథమ పరీక్షల్లో 93శాతం మార్కులతో ఎంయోగితా బాయి,ఆర్ రేవతి, ఎం,శ్రావణి, భార్గవి, అర్చనాంబలి బాయి. పల్లవి ప్రథమ స్థానం సాధించారు. ఉత్తమ పరీక్షల్లో అమృత,90శాతం మార్కులతో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించారు.ఈ సందర్బంగా విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేసి ధృవీకరణ పత్రాలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమాల్లో హిందీ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీ, మల్లీశ్వరి, భానుమతి,వేణునాయుడు,నాగిరెడ్డి, వి.కుమార్, మల్లికార్జున్ రాయుడు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులను ఆశీర్వదించి సత్కరించారు. రాబోవు రోజుల్లో గురుకులం పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆశీర్వదించారు.

## చుక్కల నిడిగల్లు లేఅవుట్ నిబంధనలకు వ్యతిరేకం

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 27 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లులో నిబంధనలకు వ్యతిరేకంగా లేఅవుట్లు వెలసినట్లు వార్త దిన పత్రికలో ప్రచురితమైన 'చుక్కల నిడిగల్లు వెలుస్తున్న అక్రమ లే అవుట్లు' వార్తపై స్పందించిన ఇఒ పిఆర్‌డి అధికారి పరుగులు తీసారు. అక్కడ పరిస్థితిని పరిశీలించారు. ఇఒ పిఆర్‌డి పద్మజ,పంచాయతీ కార్యదర్శి చెంచయ్య,రాజేష్‌లతో కలసి పరిశీలించారు.ఈ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి లేనందువల్ల బహుశా ఇలా జరిగి ఉండవచ్చునని పద్మజ అభిప్రాయపడ్డారు. పంచాయతీకి సమగ్ర సమాచారం అందించి లే అవుట్ పత్రాలను సమర్పించి పంచాయతీకి చెల్లించాల్సిన ఫీజులు చెల్లించి తుడా అప్రూవల్‌తో లే అవుట్లును వేయాలి. కానీ ఆ నిబంధనలు ఏవీ పాటించకనే లేఅవుట్లు వెలసినట్లు అధికారి గుర్తించారు. దాంతో సంబంధిత నిర్వాహకులకు నోటీసులుజారి చేసారు.అలాగే ఇక్కడ అక్రమ లేఅవుట్ల గురించి తుడా అధికారులకు,శ్రీకాళహస్తి ఆర్‌డిఓకు నివేదికలు అందించినట్లు పద్మజ వివరించారు

## ఎపిఎం బాధ్యతలు స్వీకరణ

తొట్టంబేడు,జూన్ 27 ప్రభాతవార్త :



తొట్టంబేడు మండల ఎపిఎంగా నక్కా నరసింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో గతంలో పని చేసిన ఎపిఎంను బదిలి చేయగా నక్కానరసింహులును ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు.ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో జరిగే ఉపాధి పనులకు సంబంధించి ఆయన పర్యవేక్షిస్తారు. ప్రతి గ్రామంలో రైతుకూలీలకు ఉపాధి కల్పిస్తారు.

## చెరువు తూముల మరమ్మతులకు శ్రీకారం

తొట్టంబేడు,జూన్ 27 ప్రభాతవార్త:



తొట్టంబేడు మండలంలోని ప్రధాన చెరువుల తూముల మరమ్మత్తులకు ఇరిగేషన్‌శాఖ శ్రీకారం చుట్టింది. శుక్రవారం పెద్ద కన్నలి చెరువు తూము మరమ్మత్తులకు భూమి పూజలు జరిపారు. ఈ తూమును రూ.20 లక్షలతో చేపట్టారు. మండలంలో 38 చెరువులు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు వివరించారు. అయితే శాశ్వత మరమ్మత్తుల కోసం రూ.39కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. రానున్న వర్షాకాలంలో దెబ్బతినే ప్రమాదం ఉ న్న పెద్ద చెరువుల తూముల మరమ్మత్తులను ప్రాధమికంగా ప్రాధాన్యత ఇస్తూ మరమ్మత్తులు చేపట్టామని ఇరిగేషన్ అధికారులు వివరించారు. కాగా కొద్దిపాటి వర్షానికే నిండే చెరువు కారాకొల్లు చెరువు. దీనిని కూడా రూ.15లక్షలతో చేపట్టనున్నట్లు వివరించారు.కన్నలి భూమి పూజ కార్యక్రమాల్లో ఎఇఇ నాగరాజు, తెలుగుదేశం నాయకులు కన్నలి ప్రతాప్‌రెడ్డి,ప్రవీణ్‌రెడ్డి, వెంకటాచలం పాల్గొన్నారు.ఈ సందర్బంగా తెలుగుదేశం నాయకులు క న్నలి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతు సంక్షేమానికి అత్యధికంగా ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి రైతులకు సంబంధించిన చెరువుల ఆధునీకరణకు నిధుల సాధనలో పరుగులు తీస్తున్నారన్నారు. రాబోవు వర్షాకాలాన్ని పరిగణలోకి తీసుకొని ప్రమాద స్థాయిలో ఉన్న చెరువుల మరమ్మత్తులకు నిధులు కేటాయించి పనులు చేపట్టామన్నారు. మండలంలోని చెరువులకు తెలుగుగంగ నీటిని అందించుటకు చర్యలు తీసుకున్నారని వివరించారు.

## మహిళా సాధికారితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యం

తిరుపతి విద్య జూన్ 27 ప్రభాత వార్త



మహిళలు సాంకేతికతను అందిపుచ్చుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. మహిళా సాధికారిత కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.శుక్రవారం సిఎల్ టి సెంటర్ లో మెప్మా ఆర్పీలకు ట్యాబ్ లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణీ చేశారు.169 ఆర్పీలకు గాను 153 మందికి ట్యాబ్ లు ఆయన అందచేశారు.ట్యాబ్ లో 60 యాప్ లు ఉన్నాయని,అన్నీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు,సర్వేలకు సంబంధించినవని ఆయన చెప్పారు.ఇకపై ప్రభుత్వ సేవలన్నీ వాట్స్ ప్ ద్వారానే అందించాలని సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లు నిర్ణయించారని ఆయన తెలిపారు.ప్రజలకు ప్రభుత్వ అందించే సంక్షేమ పథకాలను పారదర్శకంగా చేరవేయాలని ఆయన కోరారు.సాంకేతికంగా వస్తున్న మార్పులను మహిళలను త్వరగా నేర్చుకుని పురుషులతో పోటీ పడాలని ఆయన సూచించారు.కాగా 130 మంది డిజీ లక్ష్మీలకు బయోమెట్రిక్ డివైజ్ లను ఆయన అందించారు.స్వయం ఉపాధి,వ్యాపార రంగాల్లో మహిళలు రాణించేం దుకు అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం తీసుకుందని వాటిని మహిళలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిఎంఎం లు కృష్ణవేణి,సోమశేఖర్, సిఓలు తదితరులు పాల్గొన్నారు.



తమ నియోజక వర్గంలోని పలు అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ని కలిసి చర్చిస్తున్న గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాసిం సునీల్‌కుమార్

**తిరుపతి కలెక్టరేట్, ప్రభాతవార్త**



తిరుపతి రుయా ఆస్పత్రిలో సిటీ దయాగ్నోస్టిక్ సెంటర్ సేవలపై కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి హెల్త్, ప్రభాతవార్త**

## వైద్య ఆరోగ్య సిబ్బందిచే హాస్టల్ తనికీ

శ్రీకాళహస్తిరూరల్,జూన్ 27 ప్రభాతవార్త:



ఏర్పేడు మండల కేంద్రంలోని బిసి బాలుర హాస్టల్‌ను శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పారామెడికల్ సిబ్బంది తనికీ చేసారు.వీరు పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత గురించి అక్కడ వార్డెన్ సిబ్బందికి సూచనలిచ్చారు. మంచినీటిని పరిశీలించారు. అలాగే హాస్టల్ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తరువాత విద్యార్థుల ఆరోగ్యపరీక్షలను నిర్వహించారు.సమస్యలున్న వారికి ఉచితంగా మందులు పంపిణి చేసారు.ఈ కార్యక్రమాల్లో హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బరాయుడు, తులసీనాథ్,ఎఎన్ఎం రేటా,ఆశా వర్కర్ లత,లోటా కుమారి,వార్డెన్ పల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాముల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలి

రేణిగుంట జూన్ 27 ప్రభాతవార్త:



రేణిగుంట విమానాశ్రయం కు వెళ్లే పాత మార్గంలోని ఈవీఎం గోదాముల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం వెళ్లే పాతమార్గంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్ర పరచబడిన ఈవీఎం గోదామును శుక్రవారం పలువురు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. గోదాములో భద్రపరిచిన ఈ.వీ.ఎం యంత్రాలు బి.యులు, సియూలు, వి.వి ప్యాట్‌లను, భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల పనితీరు, యంత్రాలకు వేసిన సీళ్లు పరిశీలించారు. పరిశీలన అనంతరం రిజిస్టర్లో కలెక్టర్ సంతకం చేశారు. ఈవిఎం గోడౌన్ ఇంఛార్జి ఎస్డిసి సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో తనిఖీలు జరిగాయి.

## విద్యుత్ వాహనాలపై... రెండు దశల శిక్షణా కార్యక్రమం

తిరుపతి(రవాణ),జూన్ 27ప్రభాతవార్త:



ఆర్టీసిలో విద్యుత్ వాహనాల వినియో గాన్ని మరింతగా అభివృద్ధిపరచడం, నిర్వహణలో నైపుణ్యాలను పెంపొంది ంచడం లక్ష్యంగా ఒక సమగ్రశిక్షణా కార్యక్రమాన్ని రెండు దశాల్లో పూర్తిచేయడం జరిగిందని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇంజనీరింగ్)చెంగల్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. చివరిరోజు శుక్రవారం 13డిపోలకు చెందిన ప్రతి డిపోనుండి ఐదుగురు డిపోమేనేజర్, గ్యారేజ్ ఇన్‌ఛార్జి, ఇద్దరు మెకానిక్‌లు, ఒక ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.విద్యుత్ వాహనాల సేవల నాణ్యతను మెరుగుపరచడానికి శిక్షణ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డిపిటిఓ జగదీశ్, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ టి.బాలాజీ, రీజనల్ అసిస్టెంట్ ఇంజనీర్ మహేంద్ర పాల్గొన్నారు



## ధర్మరాజుల స్వామి ఆలయం వద్దకు అర్జున విగ్రహాలు

శ్రీకాళహస్తి,.జూన్ 27 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ధర్మరాజుల స్వామి ఆలయంలో తిరునాళ్ళు సందర్భంగా 12 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు మొదటి సారి అర్జున,శ్రీకృష్ణ,ద్రౌపదీ దేవి విగ్రహాలకు ఆలయంలోని నాయనార్ల విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. తరువాత భక్తులు మోసుకుంటూ రాగా పట్టణంలోని నాలుగుమాడావీధుల్లో ఊరేగింపుజరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయాధికారులు సుదర్శనం నాయుడు, హరియాదవ్ వారి సహాచరులు, ధర్మరాజుల స్వామి ఆలయ పూజారులు వెంటరాగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది.

## అయిల్ ఫాం సాగుతో అధిక లాభాలు

తొట్టంబేడు,జూన్ 27 ప్రభాతవార్త:




అయిల్ ఫాం సాగుతో రైతులకు లాభాల పంట పండుతుందని మెగా ఫౌండేషన్ నిర్వాహకులు రైతులకు వివరించారు. శుక్రవారం వారు రైతులకు అవగాహన సదస్సు మండలంలోని శివనాథపురం గ్రామంలో నిర్వహించారు. మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇక్కడ రైతు నాగలక్ష్మీ 155 అయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఆయిల్ ఫాం సాగు అశాజనకంగా ఉందన్నారు. తక్కువ పెట్టుబడితో అదిక లాభాలు సాధించవచ్చునన్నారు. గతంలో ఇక్కడ తాము విస్తారంగా వాణిజ్యపంటగా వేరుశెనగను పండించే వారమని కానీ వాతావరణంలో వచ్చిన మార్పులతో పండింటం కష్టంగా మారిందన్నారు.తరువాత కొంత కాలం చెరకును వాణిజ్య పంటగా పండించామన్నారు. ప్రైవేటు కంపెనీ మూసి వేయటంతో నష్టపోయామన్నారు. ప్రస్తుతం మార్కెట్లో పామాయిల్ అధిక డిమాండ్ ఉండటంతో ఈ ప్రాంతాల్లోని వాతావరణానికి అనుకూలంగా పామోలిన్ సాగుకు శ్రీకారం చుట్టామన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొంద వచ్చునన్నారు. ఈసాగుకు పురుగుల మందు,ఎరువులు పెద్దగా అవసరం లేదని రైతులు వివరించారు. ఒకసారి పంట వేస్తే ఆరు సంవత్సరాల పాటు మళ్ళీ చెట్లు నాటాల్సిన అవసరం లేదన్నారు.ఈ పంటకు నీరు కూడా పెద్దగా అవసరం ఉండదన్నారు.ఈ కార్యక్రమాల్లో మోహన్‌నాయుడు క్లస్టర్ ఆఫీసర్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రవక్త జీవన విధానం నిరాడంబరం

శ్రీకాళహస్తి,జూన్ 27 ప్రభాతవార్త:



ప్రవక్త జీవితాలు నిరాడంబరంగా సాగాయని, కానీ నేడు పరిస్థితి భిన్నంగా ఉందంటూ వారి జీవన విధానాలను మార్గదర్శకంగా తీసుకుంటే మనం స్వర్గస్తులౌతాయని హోహీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన ఇస్లాంలో మొదటి మాసం మోహారం ప్రాధాన్యతను తెలిపారు. ఈ నెల మొదటి రోజు షహీద్ అయ్యింది ఉమర్ రజీ అలాతాల అని వివరించారు. ఆయన ఆచరించిన జీవన విధనం, సత్యసంధత, అల్లాహ్ పై భక్తి భావంను వివరించారు. మనం తాత్కాలికమైన ఇక్కడి జవనమే శాశ్వతం అనుకుంటూ భగవత్ ఆరాధనను విస్మరిస్తున్నామన్నారు. మొహరంను పండగగా జరుపుకుంటున్నారని కానీ ఇవి మన ప్రవక్తల బలిదానం అని గుర్తించడం లేదన్నారు. మనకు వచ్చే ప్రతి పైసా ఎలా వచ్చిందనే పరిశీలన ఉండాలన్నారు.

## భారతదేశ వృద్ధి కారిడార్లకు...

శక్తినిచ్చేలా ఎలక్ట్రికల్ ఆటోమేషన్ పోర్ట్‌ఫోలియో

తిరుపతి(రవాణ),జూన్ 27ప్రభాతవార్త :

Lauritz Knudsen Electrical & Automation

దేశంలో కారిడార్లకు శక్తినిచ్చేందుకు లౌరెట్జ్‌నూడెన్స్ ఎలక్ట్రికల్ ఆటోమేషన్ అత్యంత ప్రతిష్టాత్మకమైన ఉత్పత్తి పోర్ట్‌పోలియోను ప్రారంభించింది. అధిక ప్రభావ పరిశ్రమ సహకారాల ద్వారా డీప్ ఇండియాలో సాంకేతిక ప్రాప్యతను వేగవంతం చేయడానికి ,అవకాశాలను విస్తరించడానికి ఒక వ్యూహాన్ని వివరించింది. స్థానిక అవసరాలకు అనుగుణంగా భారతదేశ పారిశ్రామిక సమూహాలకు ప్రాంతీయ నిర్దిష్ట ఆవిష్కరణలు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రతిష్టాత్మక చొరవలో దేశవ్యాప్తంగా 30 పారిశ్రామిక నగరాల్లో మౌళిక సదుపాయాలు మెరుగుపరచడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగవంతంచేస్తుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. ప్రభుత్వ వికసిత్ భారత్ 2047కి దార్శనికతకు అనుగుణంగా సాంకేతికంగా అభివృద్ధి చెందిన, ఆర్థికంగా స్థితిస్థాపకంగా నిర్మించడానికి దోహదపడుతుంది.

## ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే

-జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్

తిరుపతి(రవాణ),జూన్ 27ప్రభాతవార్త



ద్విచక్రవాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా తలకు హెల్మెట్ ధరించాలని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ కోరారు. చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాలు తీస్తుందని చెప్పారు. బండి నడిపే ప్రతి వ్యక్తి తలకు రక్షణగా హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు. తిరుపతి జిల్లావ్యాప్తంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, తిరుమలకు ప్రయాణించే వ్యక్తులు, టిటిడి ఉద్యోగులు, వ్యాపారులు ఘాట్‌రోడ్లపై సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ ధరించి బండి నడపాలని ఆయన సూచించారు. సురక్షిత ప్రయాణంగా మార్చుకునేందుకు తప్పకుండా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలనే ఆదేశాలు ఉండటంతో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామన్నారు. అలిపిరి టోల్‌గేట్ వద్ద తిరుమల ట్రాఫిక్ పోలీసులు సిఐ హరిప్రసాద్, తిరుపతి రవాణాశాఖ ఎంవిఐలు శ్రీనివాసరావు, అతికానాజ్, ఆంజనేయవర్మ కలసి వాహన తనిఖీలు,హెల్మెట్ ధరించకుండా బండి నడపుతున్నవారిని తనిఖీ చేశారు. రహదారిభద్రతలో భాగంగా ఈ తనిఖీలు చేయడం జరిగిందని మురళీమోహన్ తెలిపారు. అలిపిరి టోల్‌గేట్ వద్ద మెరుపుదాడుల్లో ఒకేరోజు ఏకకాలంలో80మంది ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా బండి నడపడంతో ఒక్కొక్కరికి వెయ్యిరూపాయలు జరిమానా గా 80వేల రూపాయలు వసూలుచేశామన్నారు. మోటారుసైకిల్ నడిపే వాళ్ళు తూచా తప్పకుండా హెల్మెట్ ధరించి బండి నడపాలని ఆయన సూచించారు.

## కె.వడ్డేపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే

పాకాల, జూన్ 27 ప్రభాతవార్త:



మండలం కె.వడ్డేపల్లి పంచాయతీలో ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం పర్యటించారు. పంచాయతీ పరిధిలోని అమ్మగారిపల్లి గంగమ్మ తల్లి ఆలయంలో నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం చేశారు. అనంతరం గంగమ్మ తల్లి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎన్ఆర్జిఎస్ నిధులతో సుమారు 8లక్షల 50 వేల రూపాయలతో నూతన వాటర్ ప్లాంట్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కె.వడ్డేపల్లి పంచాయతీలోని ప్రజలకు మంచి నీరు అందించాలని దృఢ సంకల్పంతో వాటర్ ప్లాంట్ ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై "శ్రీ సీతారామలక్ష్మణులు"

చంద్రగిరి, జూన్ 27 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసి యున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరిం చుకుని శ్రీ సీతారామలక్ష్మణ హనుమంత సమేతులై బంగారు తిరుచ్చిపై తిరు మాడ వీధులలో విహరిస్తూ భక్తులను దర్శనమి చ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ సీతారామలక్ష్మణ హనుమంత స్వాముల వారి ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకృతులై భక్తుల గోవింద నామస్మరణల నడుమ ఆలయ తిరుమాడ వీధులలో తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్నే అమలు చేయాలి..!

రామచంద్రాపురం, జూన్ 27 ప్రభాతవార్త:



రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్నే అమలు చేయాలని వైసిపి నియోజకవర్గ స్థాయి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రామచంద్రాపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్ట్‌కు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ .. చంద్రగిరిలో చెవిరెడ్డి కుటుంబాన్ని తుడిచి పెట్టడానికి అక్రమ కేసులు బనాయిస్తున్నట్లు ఆరోపించారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైసిపి నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ కక్షలను నెరవేర్చుకోవడానికి పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీ నేతలపై అక్రమ కేసులు పెడుతున్నట్లు దుయ్యబట్టారు. ఇలాంటి చర్యలు భవిష్యత్తు తరాలకు మంచిది కాదని హెచ్చరించారు. కష్టమంటే ఆలస్యం చేయకుండా ప్రజలకు సహాయం అందించే చెవిరెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేస్తే కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా వున్నామన్నారు. చెవిరెడ్డి కుటుంబానికి కలియుగ వైకుంఠవాసుడు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు.

## వాహనాలపై బోగస్ స్టిక్కర్లకు ఉద్వాసన

రేణిగుంట మే 27ప్రభాతవార్త:



తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు రేణిగుంట అర్బన్ పోలీసులు శుక్రవారం వాహనాలపై బోగస్ స్టిక్కర్లను తొలగించారు. ఇటీవల కాలంలో చాలామంది తమ ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర సొంత వాహనాలపై ప్రెస్, పోలీస్, ఆర్టీవో, ఆర్మీ, రెవిన్యూ, జ్యుడీషియల్ అదే విధంగా మరికొన్ని ప్రభుత్వ కార్యాలయ స్టిక్కర్లు వేసుకొని యదేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్న విషయంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బోగస్ స్టిక్కర్లను తొలగించే కార్యక్రమానికి రేణిగుంట అర్బన్ పోలీసులు శ్రీకారం చుట్టారు. స్టిక్కర్లు వేసుకున్న వాహన దారులు పనిచేస్తున్న సంస్థల ఐడి కార్డులు, అక్రిడిడేషన్లు పరిశీలించి సరైన గుర్తింపు కార్డులు చూపని వాహనాలపై స్టిక్కర్లను అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్సై అరుణ్ కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో వాహనదారులు ఎంత వాదించిన వినకుండా తొలగించారు.

## బడుగు వర్గాల సమస్యలు పరిష్కరించండి : స్టార్ కృష్ణ

రేణిగుంట జూన్ 27 ప్రభాతవార్త :



బడుగు బలహీన దళిత వర్గాల సమస్యలను పరిష్కరించాలని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని కోరారు. రేణిగుంట తహసిల్దార్ గా విధులలో చేరిన చంద్రశేఖర్‌రెడ్డిని అంబేద్కర్ స్టార్ కృష్ణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. మండలంలో చాలామంది బలహీన దళిత వర్గాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని వారి సమస్యలను పరిష్కరించాల్సిందిగా తహసీల్దారును కోరారు. స్పందించిన తహశీల్దార్ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తన దృష్టికి వచ్చిన చట్టబద్ధమైన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ తో పాటు డిప్యూటీ తహసీల్దార్ శ్యాం ప్రసాద్‌ను కూడా సత్కరించారు. సంఘం నాయకులు గాలి రవి, ఈశ్వర్, నల్లన్న, సుబ్బరామయ్య, రాజా, గురుమూర్తి, చంగల్ రాయలు, విష్ణు తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

# లయన్స్ క్లబ్ టౌన్ నూతన కార్యవర్గం ఎన్నిక



గూడూరు, జూన్ 27 ప్రభాతవార్త: పట్టణంలోని డిఎన్ఆర్ కమిటీ హాల్ నందు లయన్స్ టౌన్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడుగా మోడీబోయిన శీను యాదవ్, సెక్రెటరీ వెద్దుర్ల వెంకయ్య, ట్రెజరర్ పసుపులేటి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా పైడిమర్రి రాజేంద్రప్రసాద్, జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, జాయింట్ ట్రెజరర్ పల్లమాల ప్రభాకర్, నూతన సభ్యుడు వై జె పి జాయింట్ సెక్రటరీగా వినోద్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గంగా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎంజెఎఫ్‌పై గురునాథం మాట్లాడుతూ 2025-26 సంవత్సర మునకు నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ పేదలకు మంచి సేవలు అందిం చాలని నూతన వర్గాన్ని కోరడం జరిగింది. అనంతరం మురళి నాయుడు మాట్లాడుతూ కొత్త సభ్యులనే చేర్పించిన వారికి లయన్స్ ఇంటర్నేషనల్ ద్వారా గుర్తించి వారికి జ్ఞాపకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రబత్తిన గురునాథం, పయ్యావుల మురళి నాయుడు, వైస్ గవర్నర్ ఆర్ వి.రావు, క్లబ్ ప్రెసిడెంట్ పట్నం వెంకట మనోజ్ కుమార్, ట్రెజరర్ గోపీనాథ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, ఎస్ఎల్ఎన్‌స్వామి, మురళీకృష్ణ, కావేరిలు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించండి



గూడూరు, జూన్ 27 ప్రభాతవార్త: పంచాయతీ కార్యదర్శులపై పెరుగుతున్న పనిభారం, ఒత్తిడి, ఇతర ఉద్యోగ సమస్యలపై పంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఓకు శుక్రవారం వినతి పత్రం అందజేసారు. సచివాలయాల సర్వే పని భారామంతా, చివర మాపై పడుతుందన్నారు. వారు కేవలం డిడిఓ అనే కారణం చేత మిగతారు సర్వే చేయకపోయిన ఆభారం కార్యదర్శిగా మా మీద పడుతున్నదన్నారు. వారు కేవలం డిడిఓ అనే కారణం చేత మిగతారు సర్వే చేయకపోయిన ఆ సర్వ భారం కార్యదర్శిగా మాపై పడుతుందన్నారు. అంతేకాకుండా కొంత మంది సిబ్బంది సదరు సర్వేల నుండి మినహాయింపు కల్పిస్తూ వారి హెచ్ఓడిల ద్వారా సర్క్యూలెస్ తెచ్చుకున్నారు. ఐవిఆర్ఎస్ కాల్స్ అనేవి కేవలం పంచాయతీరాజ్ శాఖకి మాత్రమే పరిగణలోనికి తీసుకుని అన్నారు.

## ఘనంగా సతీష్ జన్మదిన వేడుకలు



చిల్లకూరు, జూన్ 27 ప్రభాతవార్త: మండలంలోని తమ్మినపట్నం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సతీష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సతీష్ అభిమానులు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాల శాలువాలు, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మా అందరి ఆశీస్సులతో నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రతి ఒక్కరు ఆశీర్వదించడం జరిగింది. మేకల వెంకయ్యతో పాటు వారి అభిమానులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో హెలెన్‌కెల్లర్ జయంతి



సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త: దివ్యాంగుల ఆశాజ్యోతి మేడమ్ హెడెన్ కెల్లర్ 145వ జయంతిని స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భ ంగా ఎన్‌పిఆర్‌డి అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగుల ఆశాజ్యోతి హెలెన కెల్లర్‌ను ఆదర్శంగా తీసుకుని దివ్యాంగులు తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భవిత పాఠశాల ఉపాధ్యాయులు వీటీ భార్గవి, సాయిసంధ్య, ప్రభుత్వ హైస్కూల్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సూర్యకుమారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిటిఇ పరీక్షల్లో గోకులకృష్ణ విద్యార్థుల ప్రతిభ



సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులు మొదటి సంవత్సరం డిప్లొమా, ఎస్‌బిటిఇ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు 9 జిపిఎ కంటే అధికంగా మార్కులు సాధిం చారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో వీరిని అభినందిం చారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను వీరు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన బ్రహ్మయ్య విద్యార్థుల కోసం తమ యాజమాన్యం తరఫున అందజేస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఆ మనోహర్, ప్రిన్సిపాల్ ముచ్చుకాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఊనుగుంటపాలెం సొసైటీకి కేంద్రస్థాయి గుర్తింపు



కోట, జూన్ 27 ప్రభాతవార్త : మండలం ఊనుగుంటపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి కేంద్రస్థాయి గుర్తింపు లభించింది. ఈ సంఘం రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘంగా గుర్తించి నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. దీంతో కోట మండల పరిధిలోని రైతులందరు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే అనేక సదుపాయాలను ఉపయోగించుకోవచ్చని సిఇఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆ మేరకు శ్రీనివాసులురెడ్డిని మండలంలోని సొసైటీ సిఇఓలు అభినందించారు. ఊనుగుంటపాలెం సొసైటీ సిఇఓ శ్రీనివాసులురెడ్డి మొదటి నుంచి క్రమశిక్షణతో తన సంఘాన్ని అంచలంచెలుగా ప్రగతిపథంలోకి తీసుకెళ్లారు. గతంలో కూడా ఈ సొసైటీ జిల్లాస్థాయిలో అనేక పురస్కారాలు, ప్రశంసలు అందుకొని ఉంది.

## ఇంటింటా ఉపాధ్యాయుల ప్రచారం



కోట, జూన్ 27 ప్రభాతవార్త: మండలం వెంకన్న పాలెం పంచాయతీ పరిధిలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, మహ్మద్ రజ్వి, శ్రీనివాసరావులు ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి అవగాహన కల్పించారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్నామని చెప్పారు.

## జామాయిల్ దుంగలు స్వాధీనం

కోట, జూన్ 27 ప్రభాతవార్త: మండలం మద్దాలి పంచాయతీలో ఓజిలి మండలం ఆచార్లపార్లపల్లి గ్రామానికి చెందిన కొందరు అక్రమంగా జామాయిల్ చెట్లు నరికి ట్రాక్టర్‌లో లోడు చేస్తుండగా గ్రామస్థులు పట్టుకోవడం తెలిసిందే. ఆ మేరకు శుక్రవారం ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి కోటకు వచ్చి పోలీసులు స్వాధీనం చేసుకున్న దుంగలను కొండుగుంట ఫారెస్ట్ సెక్షన్‌కు తీసుకెళ్లారు. పట్టుబడిన ఆ దొంగలను విచారించి జరిమానా విధిస్తామన్నారు.

## వాయిదా పడ్డ అధ్యక్ష ఎన్నికలు



పెళ్లకూరు, జూన్ 27 ప్రభాతవార్త: టిడిపిలో రెండు వర్గాల మధ్య ఆధిపత్యం పోరుతో ఆగిన మండల అధ్యక్ష పదవి ఎన్ని కపెళ్లకూరు మండలంలో మండలం సంస్థాగత ఎన్నికలనుపార్టీ పరిశీలకులు శివప్రసాద్ వాయిదావేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలపార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ సూళ్లూరుపేట శాసన సభ్యురాలు నెలవల విజయశ్రీ అధ్యక్షతన నాయుడు పేటలోని టీడీపీ క్యాంప్ కార్యాలయం లో ఎన్నికల పరిశీలకులు శివప్రసాద్, వేంకటేశ్వర్ రెడ్డి, శివకుమార్‌లు పార్టీ నాయకులుతో కలసి ఎన్నికల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. గ్రామ నాయకులు మధ్య సాయోధ్య కుదరక పోవటంతో ఎన్నికల పరిశీలకులు శివప్రసాద్ తాత్కాలికంగా గ్రామ కమిటీ ఎన్నికలను వాయిదా వేశారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని పంచాయతీ ఎలక్షన్లను తలపిస్తున్నాయని ప్రజలు నివ్వరపోతున్నారు, అధిష్టానం దయ, ప్రజల మద్దతు ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

## టిడిపి మండల అధ్యక్ష పదవి ఎవరికి దక్కెను!

**- రసవత్తరంగా మారిన అధ్యక్ష పదవి**

దొరవారి సత్రం, జూన్ 27 ప్రభాతవార్త: పోటాపోటీగా డివి సత్రం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష పదవికి పోటీ నెలకొంది మండలంలో ఇప్పటికే సీనియర్ నాయకులు వేముసాని శ్రీనివాసులు నాయుడు అధ్యక్షునిగా కొనసాగుతున్నాడు. అయితే మళ్లీ మండల అధ్యక్ష పదవిని ఎలాగైనా తన అధ్యక్ష పదవిని చేజిక్కించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. అయితే ఈసారి అధ్యక్ష పదవిని టిడిపి సీనియర్ బీసీ నాయకుడు వంకా సుధాకర్ మండల అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్నాడు. దీంతో డివి సత్రంలో టిడిపి మండల అధ్యక్షుడు పదవి కోసం రసవత్తమైన రాజకీయం గత నెల రోజుల నుండి గ్రామాలు రాజకీయం వేడెక్కింది. ఈనెల 29వ తేదీన ఎన్నిక జరుపుటకు అడ్వైజర్ కమిటీ రానన్నట్లు ఇప్పటికే గ్రామాల్లో నువ్వా నేనంటూ టిడిపి నాయకులు మధ్య ఎన్నికల జయభేరి ప్రారంభమైంది. వేమసాని వర్సెస్ వంక మధ్య తీవ్ర పోటీ నెలకొంది ఈ పోటీలో ప్రస్తుతం అధ్యక్షుడు శ్రీనివాసులు రెండోసారి పీఠం ఎక్కుతాడ లేదా బిసి నాయకుడు వంక సుధాకర్ దక్కించుకుంటాడు ఈ విషయంపై టిడిపి నాయకులు మధ్య అలజడి మొదలైనది. అధిష్టానం నుండి వేమసానికి మద్దతు ఉన్నట్లు బహిరంగని గుసగుసలు వినిపిస్తున్నాయి

## సమయపాలన పాటించాలి : సిడిపివో

వెంకటగిరి, జూన్ 27 ప్రభాతవార్త: అంగన్వాడి సిబ్బంది కచ్చితంగా సమయ పాలన పాటించాలని వెంకటగిరి సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. వెంకటగిరి లోని సిడిపిఓ కార్యాలయంలో అంగన్వాడి వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. అంగన్వాడి కేంద్రాలను నిబంధనల ప్రకారం సమయానికి తీయాలని తెలిపారు. శిథిలావస్థలో ఉండే భవనాల్లో అంగన్వాడి కేంద్రాలు నిర్వహించరాదని సూచించారు. చిన్నారులకు భద్రతే ముఖ్యమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలకు నాసిరకం పౌష్టికాహారం వస్తే వాటిని తిప్పి పంపాలని తెలిపారు. కోడిగుడ్లు, ఇతర సరుకులు నాణ్య మైనవై ఉండాలని ఉండాలని తెలిపారు. ఫేస్ రీడింగ్ పెడితేనే సరుకులు కూడా ఇకనుండి ఇస్తారని చెప్పారు. ప్రత్యేక ఆధార్ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో విస్తరణ అధికారిని వినేషా తదితరులు పాల్గొన్నారు.

# బడి విధులకు టీచర్ డుమ్మా...విద్యార్థులకు సెలవు



తొట్టంబేడు, జూన్ 27 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఆకర్షించుటకు ప్రభుత్వం ఎన్నో పథకాలు, సంస్కరణలు, తాయిలాలు అందిస్తున్నారు. అయితే కొందరు ఉపాధ్యాయుల తీరు మాటంలేదు. దాంతో వ్యవస్థపై తల్లిదండ్రులకు వ్యతిరేక భావం కల్గుతుంది. ఈ నేపధ్యంలో పట్టణానికి సమీపంలో ఉన్న శివనాధపాళెం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు బడికి ఎగనామం పెట్టారు. ఆమె బదులు మరో టీచర్ వస్తారని చెప్పారు. కానీ అమె కూడా హాజరు కాకపోగా, దాంతో విద్యార్థులు ఆటల్లో మునిగి తేలారు. ప్రభాత వార్త ఇక్కడ ఆడుకుంటున్న విద్యార్థులను విచారించగా తమ టీచర్ రాలేదన్నారు. అక్కడ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం తయారు చేస్తున్న వంట మనిషిని విచారించగా, వేరే టీచర్ వస్తారని చెప్పారు. కానీ ఇంత వరకు (ఉదయం 10గంటల వరకు) రాలేదని చెప్పారు. ఈ పాఠశాల తలుపులను గ్రామంలో ఉండే జానకమ్మ తెరుస్తుందట. పాఠశాల తాళాలు ఆమె వద్దనే ఉంటాయట. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఉపాధ్యాయుల తీరుతో ఉన్న కొద్దిమంది కూడా సమీపంలోని పట్టణానికి తరలి వెళ్ళే ప్రమాదం ఉంది. దాంతో పాఠశాలను శాశ్వతంగా మూసివేసే ప్రమాదంఉందని అధికారులు గుర్తించాల్సి ఉంది.

## మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ...
## మైన్ డైమండ్ షో ప్రారంభం



తిరుపతి, విద్య జూన్ 27 ప్రభాతవార్త : ప్రపంచంలో అతి పెద్ద జ్యూవెలరీ సంస్థ ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ తిరుపతి షోరూంలో మైన్ డైమండ్స్ షోని ప్రారంభించింది. ఈ సంస్థ తమ తిరుపతి షోరూంలో ప్రత్యేక వజ్రాభరణాల ప్రదర్శనను ప్రారంభించారు. ఈ డైమండ్ షోని ముఖ్య అతిధులుగా కస్టమర్లు, షోరూం హెడ్ రిజేష్, వినియోగదారులు, శ్రేయోభిలాషులు, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధుల సమక్షంలో ప్రారంభించారు. ఈ డైమండ్ షోలో రోజూ ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ ఆభరణాలు, పురుషుల ఆభరణాల సముదాయాన్ని అందిస్తున్నారు. మీకు నచ్చి సొంతం చేసుకొనే విధంగా కేవలం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తిరుపతి షోరూంలో 26 జూన్ నుండి 30 జూన్ 2025 వరకు ఈ డైమండ్ షో కొనసాగుతుంది. వినియోగ దారులు కొనుగోలు చేయాలనుకున్న బంగారం విలువలో 10 శాతం ముందుగా చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని పొందవచ్చు. తద్వారా భవిష్యత్తులో పెరిగే బంగారం ధరల నుండి లబ్ది పొందవచ్చు. ఈ ఆఫరు ద్వారా నగలు కొనుగోలు చేసిన వారు, బుక్ చేసిన రోజు ధర లేదా కొనుగోలు చేసిన రోజు ధర, ఏ ధర తక్కువ ఉంటే ఆ ధర చెల్లించే సదవకాశం ఉంది అని తెలిపారు.

## ఐటీ పరిశ్రమ విశ్వవ్యాప్తంగా విస్తరిస్తోంది




రేణిగుంట జూన్ 27 ప్రభాతవార్త : ఐటీ పరిశ్రమ విశ్వవ్యాప్తంగా విస్తరిస్తోందని రేణిగుంట మండలం తిరుపతి కరకంబాడి మార్గంలోని ఆర్‌సిఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ టెక్నాలజీ కళాశాల డైరెక్టర్ ప్రిన్సిపల్ రవికుమార్ చౌదరి అన్నారు. ఆర్‌సిఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ఎంసీఏ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేతో పాటు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన డిక్సన్ టెక్నాలజీస్ లిమిటెడ్ మాజీ ఉపాధ్యక్షుడు కేపీ రాజు, గౌరవ అతిథి మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ఏపీ ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్, కళాశాల డైరెక్టర్ రవికుమార్ చౌదరి, కరస్పాండెంట్ శివప్రసాద్ శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధస్సు సంబంధిత రంగాలలో ముందుకు దూసుకుపోతుందన్నారు. ఈ నేపథ్యంలో ఎంసీఏ విద్యార్థులకి మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి నిరీష, ఎంసీఏ విభాగాధిపతి లలిత, అధ్యాపకులు సతీష్, మురళి, మాధురి, కళాశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్త కన్నప్ప సినిమా అద్భుతం: కోలా




శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరుని మూఢ భక్తితో కన్నులు అర్పించిన మూఢ భక్తుడి చరిత్రను అత్యద్భుతంగా చిత్రీకరించారని రాష్ట్రబిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ అన్నారు. శుక్రవారం విడుదల అయిన భక్త కన్నప్పచిత్రాన్ని చూసిన తరువాత ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ తాను పుట్టక ముందు బేడర్ కన్నప్ప అంటూ కన్నడ నటుడు అద్భుతంగా నటించి ప్రజాదరణ పొందిందన్నారు. తరువాత కృష్ణంరాజు నటించారని మారిన ప్రజల అభిరుచికి అనుగుణంగా సినీ నటులు మోహన్‌బాబు తన సొంత బ్యానర్‌పై ' కన్నప్ప' పేరుతో తెరకెక్కించారన్నారు. మల్టీ స్టార్‌తో నిర్మించిన ఈ చిత్రానికి భారీ బడ్జెట్ పెట్టుబడి పెట్టారన్నారు. శ్రీకాళహస్తి ఆధారంగా తీసిన వాయులింగేశ్వరుని భక్తుడి చరిత్ర శ్రీకాళహస్తి గొప్పతనాన్ని కన్నప్ప మనస్తత్వాన్ని రూపొందించారన్నారు. చిత్రంలో మోహన్‌బాబు, మోహన్ లాల్ మంచు విష్ణు, శరత్‌కుమార్, అక్షయ కుమార్, ప్రభాస్‌లు ఎవరికి వారు పోటీలు పడ్డారు. సినిమా అద్భుతంగా ఉందన్నారు. టీంకు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీలక్ష్మి అలంకరణలో వారాహిదేవి



రామచంద్రాపురం, జూన్ 27 ప్రభాతవార్త: శ్రీలక్ష్మి అలంకరణలో వారాహిదేవి అమ్మవారు శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. రాయలచెరువు వద్ద వెలసియున్న శ్రీశక్తి పీఠంలో శ్రీవారాహిదేవి అమ్మవారి దేవినవరాత్రి ఉత్సవాలు కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానందభారతి మహాస్వామి దివ్య సమక్షంలో మంత్ర మహేశ్వరి శ్రీశక్తి పీఠాధీశ్వరి మాతాజీ శ్రీరమ్యానంద భారతి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 2వ రోజున ఉదయం పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మి వారాహిదేవి అమ్మవారికి దర్బారు సేవ నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని 8 వేల మంది భక్తులు దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# గూడూరు డివిజన్

## నిడిగుర్తి సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



వాకాడు, జూన్ 27, ప్రభాతవార్త : మండలంలోని నిడిగుర్తి సచివాలయాన్ని శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తనిఖీ చేసారు. సచివాలయానికి సంబంధించినటువంటి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులు రిజిస్టర్లు తనిఖీ చేసారు. సచివాలయానికి సంబంధించినటువంటి సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే మండల కార్యాలయంలో తెలపవలసిందిగా సంబంధిత పంచాయతీ కార్యదర్శికి సూచించడం అయినది విధులు పట్ల ఎలాంటి అలసత్వం లేకుండా సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికి మర్యాద పూర్వకంగా వారి సమస్యలను తీర్చేలా నిబద్ధతతో కూడిన విధులు నిర్వర్తించా ల్సిందిగా ఎంపీడీవో సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం చేపడుతు న్నటువంటి ప్రతి సర్వేలను జాగ్రత్తగా సకాలములో పూర్తి చేయవలసినదిగా సిబ్బందికి తెలియజేసారు. తప్పకుండా ప్రతి రోజూ బయోమెట్రిక్ హాజరు వేయవలసిందిగా ఏమైనా కారణాల చేత బయటకు వెళ్లాల్సి న పరిస్థితి ఏర్పడినప్పుడు మూమెంట్ రిజిస్టర్లో నమోదు చేసి వెళ్లవలసిందిగా సిబ్బందికి తెలియజేసారు. ఈ తనిఖీల్లో గ్రామ సర్పంచ్ ఎం. నాగరాజు, డిఎ అంకమ్మ, వెల్ఫేర్ సహాయకులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతోనే సమాజంలో గౌరవం



గూడూరు, జూన్ 27 ప్రభాతవార్త : పట్టణంలోని సంయుక్త నగర్‌లో ఉన్న శ్రీ సరస్వతి శిశు మందిరం పాఠశాలను అమెరికాలో నివాసముంటున్న సన్నారెడ్డి నివ్య, సన్నారెడ్డి నిరీష, సన్నారెడ్డి నిష్యా సందర్శించారు. వారు విద్యార్థులతో కాసేపు గడిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిశు మందిరం విద్యార్థులు ఎంతో ప్రతిభను చూపిస్తున్నారని, చిన్న వయసులోనే పిల్లలు సంస్కృత శ్లోకాలు చెప్పడం, దేశభక్తి గీతాలు పాడటం అభినందనీయమన్నారు. బాగా చదువుకొని వృద్ధిలోకి వచ్చినప్పుడే మీ తల్లి తండ్రులకు గౌరవం లభిస్తాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు మల్లెమాల మురళిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మయూరి శ్యామ్ యాదవ్, వెంకట రమణయ్య, సనత్‌రెడ్డి, వంగా ప్రసాద్ రెడ్డి, ప్రవీణ్ కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగనాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటో నగర్‌కు రిజిస్ట్రేషన్‌లు



గూడూరు, జూన్ 27 ప్రభాతవార్త: నెల్లూరు నుండి డిప్యూటీ మేనేజర్ చంద్రశేఖర్ రెడ్డి గూడూరు రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కి మొట్టమొదటిసారిగా వచ్చి ఆటో నగర్ ప్లాట్స్ ఐదుగురు సభ్యులకి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మేనేజింగ్ డైరెక్టర్ మంగళగిరి అధికారితో మాట్లాడి మనకు రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా చొరవ తీసుకున్నందుకు మా కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేసారు. ఇందులో భాగంగా రోడ్లు, కరెంట్, అన్ని వసతులు త్వరలో మొదలు పెడతామని చెప్పారు. ఆటోనగర్‌కి శుభ ఘడియలు వచ్చాయి అని సభ్యులందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రెసిడెంట్ చాంద్ బాషా, ప్రధాన కార్యదర్శి మర్రిపల్లి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

**వైసీపీ మైనారిటీ విభాగం...**

## రాష్ట్ర అధికార ప్రతినిధిగా మగ్దూమ్



గూడూరు, జూన్ 27 ప్రభాతవార్త: వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎండీ మగ్దూమ్ మొహిద్దీన్‌ను ఆ పార్టీ అధిష్ఠానం రెండోసారి నియమించింది. ఈ సందర్భంగా మగ్దూమ్ గూడూరు పట్టణంలోని సనత్ నగర్ నందు వున్న గూడూరు వైసీపీ నియోజకవర్గ ఇంచార్జి స్థానిక శాసన మండలి సభ్యులు మేరిగ మురళీధర్‌ను కలిసి శాలువా కప్పి పూల మాలలతో సత్కరించారు. మగ్దూమ్ మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా తనను రెండోసారి నియమించి నందుకు మా నాయకులు జగన్మోహన్ రెడ్డికి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఆంధ్ర ప్రదేశ్ శాసనమండలి సభ్యులు మేరిగ మురళీధర్‌కి, తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తికి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ జనాబ్ వి. ఖాదర్ బాషాకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మగ్దూమ్, అల్తాఫ్, జహీర్, సుభహాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను యధావిధిగా కొనసాగించండి:ఎమ్మెల్యే



గూడూరు, జూన్ 2 ప్రభాతవార్త: స్కూల్స్ మెర్జింగ్ వలన గూడూరు నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలలో విద్యార్థులు దూరప్రాంతాలకు వెళ్ళలేక ఇబ్బందులో ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లి తండ్రులు, ప్రజా ప్రతినిధులు వచ్చి విజ్ఞప్తి చేస్తున్నారని, కొన్ని స్కూల్స్‌కి మినహాయింపు ఇచ్చే విధముగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు గూడూరు శాసన సభ్యులు సునీల్ కుమార్ వినతి పత్రం అందచేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో మరికొన్ని సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని వారు తెలిపారు.

## వ్యబిచార స్థావరాలపై పోలీసుల దాడులు!

నాయుడుపేట, జూన్ 27 ప్రభాతవార్త: నాయుడుపేట పట్టణంలోని వ్యబిచార స్థావరాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నాయుడుపేట నుండి శ్రీకాళహస్తికి వెళ్ళే రోడ్డుపక్కన ఉన్న ఓ లాడ్జిలో వ్యభిచారం జరుగుతుందని పోలీసులకు సమాచ్చారం రావడంతో నాయుడుపేట సిఐ బాబి తనసిబ్బందితో కలిసి ఆ లాడ్జిపై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మహిళ, లాడ్జి ఓనర్ ను అదుపులోనికి తీసుకొన్నారు. వారిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాట్లు సిఐ తెలిపారు.

## పరిశ్రమలను వికేంద్రీకరించాలి : జయచంద్రనాయుడు



తొట్టంబేడు, జూన్ 27 ప్రభాతవార్త: జిల్లా వ్యాప్తంగా, నియోజకవర్గాల వారీగా పరిశ్రమలను వికేంద్రీకరించాలని తిరుపతిలో జరిగిన ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవంలో మంత్రి కొండపల్లి శ్రీవాసన్‌ను మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జయచంద్రనాయుడు కోరారు. దీనివలన కార్మికులు వలస వెళ్లే పరిస్థితి లేకుండా స్థానికంగా ఉపాధి పొందే అవకాశం కలుగుతుందన్నారు. తిరుపతిలో హోటల్ తాజ్‌లో ఆయన వివిధ అంశాలను మంత్రి కొండపల్లి దృష్టికి తీసుకురావడంతో, ఆయన సానుకూలంగా స్పందించినట్లు జయచంద్రనాయుడు తెలిపారు.

## ప్రమాదంలో గాయపడివారికి పరామర్శ



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 27 ప్రభాతవార్త: మండలం, యార్లపూడి గ్రామస్తులు ఆలత్తూరు వెంకటయ్య, ఆలత్తూరు సుజాతలకు పల్లంపేట దగ్గర తమ ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన వీరిని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రినందు పరామర్శించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని అక్కడి వైద్యులకు సూచించారు.

## జేఈఈ, నీట్ టాపర్లను అభినందించిన కలెక్టర్



తిరుపతి విద్య, జూన్ 27 ప్రభాతవార్త: స్థానిక నారాయణ విద్యాసంస్థలలో చదివి జేఈఈ అడ్వాన్స్, నీట్ పరీక్షలలో జిల్లా నుంచి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. టాప్ ర్యాంకులు సాధించిన జేఈఈ విద్యార్థులు భానుచరణ్ రెడ్డి 51, మణిదీప్ రెడ్డి 345, హిమేష్ రాఘవ 468, శశాంక్‌రెడ్డి 618, యశ్వంత్ 906, నిఖిల్ 1056, నీట్ టాపర్లు జ్ఞానీష 934, మోనిక, కీర్తి, విశ్వక్ అగర్వాల్‌లు కలెక్టర్ ను వారి కార్యాలయంలో కలిసినప్పుడు జిల్లా నుంచి అత్యుత్తమ ర్యాంకులు సాధించినందుకు వారిని అభినందించి భవిష్యత్తులో జిల్లాకు, రాష్ట్రానికి వారి సేవలను అందించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ ని కలిసిన వారిలో డి జి ఎం కొండల రావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు డీన్లు, ప్రిన్సిపాల్లు, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి...7 మంది అరెస్టు

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలంలోని తిరుమంజనం వారి కండ్రిగ అనే బూరగమాను కండ్రిగ వద్ద ఏటి గట్టున పేకాట ఆడుతున్న స్థావరంపై శుక్రవారం రూరల్ ఎస్ఐ నరసింహారావు సారధ్యంలో ఆకస్మిక దాడి జరిపి ఏడుగురిని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ తరచూ పేకాట జరుగుతుందని ఫిర్యాదులు అందాయి. దాంతో శుక్రవారం దాడి చేయగా పేకాట ఆడుతున్న ఏడుగురు పట్టుబడ్డారని వారి నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.